# కుర్రకారు సమస్యలకి, సంతోషానికి కేరాఫ్ టికెట్ వినోదం

ఉదయం 7 గంటలు! అందరూ న్యూస్ పేపర్ చదువుకునే టైమ్.

అప్పుడే నిద్రలేచిన విజయ్ మాత్రం టెలిఫోన్ రిసీవర్ ఎత్తి ఫ్రెండ్‌కు 'డయల్' చేశాడు.

అవతల 'ప్రకాష్' ఫోన్ ఎత్తాడు.

"హాయ్ ప్రకాష్! ఈ రోజు మనకు కాలేజి లేదు" అని విజయ్ చెప్పబోతుండగా,

"ఏరా...! ఈ రోజు ఏ వి.ఐ.పి అయినా చనిపోయాడా? అడిగాడు ఆత్రంగా, ఆనందంగానూ ప్రకాష్.

"సెలవ్ అంటే సెలవు కాదురా. మనం ఇచ్చుకునే సెలవు" చెప్పాడు విజయ్.

"ఏంటి? ప్రోగ్రామ్ ఏమైనా పెట్టావా?" అడిగాడు ప్రకాష్.

"పెట్టా" విజయ్ సమాధానం.

"ఏం ప్రోగ్రామ్?" అడిగాడు ప్రకాష్.

"సినిమా" అని చెప్పాడు విజయ్.

"సినిమాకైతే నేను రాను. చచ్చే బోర్. ఈ మధ్య సినిమాలు చూసి బోర్ కొట్టింది. ఒక్క సినిమా బాగుండి చావదాయె! ఈ జన్మలో సినిమా చూడకూడదు అన్పించింది మొన్నో సినిమా చూసిన తర్వాత...." అని ప్రకాష్ చెప్పబోతుండగా,

"నేను కూడా అదే ఫీలింగ్‌లో వున్నా. అయితే రాత్రి ఓ సినిమా చూశా రాధిక కలిస్తే. (రాధిక విజయ్ 'గాళ్ ఫ్రెండ్') యమా థ్రిల్‌గా వుందనుకో. రాధికయితే పడిపడి నవ్వింది. మేమిద్దరం ఎంజాయ్ చేద్దామని థియేటర్ కెళ్తే మేం సినిమా చూసి ఎంజాయ్ చేయవలసి వచ్చింది. అదీ పరిస్థితి. అంత 'ఫన్నీ'గా వుంది. పిచ్చి కామెడీ అనుకో. నువ్వు 'కోక్' తాగినా రాదు. సిగరెట్ లాగినా రాదు. కాని మంచి 'ఎంటర్‌టైన్‌మెంట్'రా సినిమా అంతా. మనందరం కలిసి చూద్దాం. వీలైతే మన బ్యాచ్‌లోని వనజ, కిరణ్మయి, శృతి వాళ్లనికూడా కలిపావంటే ఇక థ్రిల్లే థ్రిల్లు." అన్నాడు విజయ్.

"ఇంతకీ ఏం సినిమా అది?" అడిగాడు ప్రకాష్.

" 'వినోదం' అని 'మనీషా' వాళ్లు తీశారు. ఎస్వీ కృష్ణారెడ్డి డైరెక్షన్. అచ్చిరెడ్డి అని నిర్మాత. ఇంతకుముందు వీళ్లు తీసినవి మాయలోడు, యమలీల నేను చూశాను. ఎంత ఎంజాయ్ చేశానో, అంతకన్నా ఎక్కువ ఎంజాయ్‌మెంట్ 'వినోదం'లో వుంది " చెప్పుకుంటూ పోయాడు విజయ్.

"ఏ షోకెళ్దాం?" అడిగాడు ప్రకాష్.

"కాలేజీకి 'డుమ్మా' అంటున్నాంగా 'మార్నింగ్‌షో'నే. పదకొండు గంటలాటకి. అయితే నువ్వు తొమ్మిది గంటలకల్లా వెంకటేశ థియేటర్‌కి రా. (హైదరాబాద్‌లోని ఒక థియేటర్) రెండు గంటలు ముందు పోకపోతే టికెట్లు దొరకడం లేదు. నేను రాఘవకు, కిరణ్ వాళ్లకి ఫోను చేస్తాలే. నువ్వు కిరణ్మయి వాళ్లని చూసుకో" అని చెప్పాడు విజయ్.

"అలాగే" అని ఫోను పెట్టేశాడు ప్రకాష్.

గబగబా న్యూస్ పేపర్ తిరగేసి సినిమాకి బయల్దేరాలనుకున్నాడు విజయ్. పేపర్ తిరిగేస్తుండగా కన్పించింది– కలర్‌లో ఓ అరపేజీ 'వినోదం' ప్రకటన. అందులోని 'రవళి' (కథానాయిక) స్టిల్ చూడగానే తన రాధిక గుర్తొచ్చింది విజయ్‌కి.

"రాధికతో మళ్లీ వెళ్లాలి 'వినోదానికి' " అని స్వగతంలో అనుకుని టూత్ బ్రష్‌కోసం గదిలోకెళ్లాడు విజయ్!

* * *

పోస్ట్‌మాన్ చేతికిచ్చిన ఉత్తరం చింపి చదివాడు విశ్వనాధరావు.

"మీ అబ్బాయి 'చైతన్య' 15 రోజుల నుంచి కాలేజికి రావడం లేదు. రీజన్ ఏమిటో తెలుసుకోవచ్చా? " అని అడుగుతూ కాలేజి ప్రిన్సిపాల్ పంపిన లెటరది.

విశ్వనాధరావు వంట్లోని రక్తమంతా ఒక్కసారి చల్లబడినట్లయింది.

"వీడు పదిహేను రోజులనుంచి కాలేజీకి వెళ్లడం లేదా?! రోజూ మరి కాలేజీకని ఠంచన్‌గా బయల్దేరి వెళుతున్నాడే? ఎటు తిరుగుతున్నట్లు? రానీ వీడి సంగతి ఇవ్వాళ తేల్చేస్తా? అంటూ వంట గదిలోకి వెళ్లాడు విశ్వనాధరావు.

"సుమిత్రా! తెలుసా నీ సుపుత్రుడి ఘనకార్యం! పదిహేను రోజులనుంచి వీడు కాలేజీకి వెళ్లడం లేదట. నోటీసు పంపించారు. కాలేజీవాళ్లు. ఇదిగో! అని భార్య చేతికిచ్చాడు విశ్వనాధరావు.

"నేననుకుంటూనే వున్నాను. ఈ మధ్య వాడికి టెలిఫోన్ కాల్స్ వస్తున్నప్పుడే. వీడసలు సరిగా చదువుతున్నాడా? అని ఎవరో ఒకమ్మాయి ఊరికే ఫోన్ చేస్తుంది వీడికోసం. నేను ఫోనెత్తగానే 'కట్' అయిపోద్ది. వాడెత్తితే ఎంచక్కా మాట్లాడతారు. అయితే నా అనుమానం కరెక్టే అన్నమాట. ఈ అమ్మాయితోనే వీడు 'లవ్'లో పడ్డాడండీ. పడితే పడ్డాడు! ఏ ధనవంతురాలి బిడ్డనో లవ్ చేస్తే సరి. మనకూ మంచిదే ఓ అంతస్తు పెరుగుద్ది" అని సుమిత్ర ఓ చిన్న లెక్చర్ ఇవ్వబోయింది.

"నీ ఆస్తి గొడవ పాడైపోనూ! నేను అబ్బాయి చదువు పాడవుతోందని బాధ పడుతుంటే నువ్వేంటి వెధవ ఆలోచనలతో, రానీ వాడి సంగతి తేల్చేస్తా" అంటుండగా

సరిగ్గా అప్పుడే కాలింగ్ 'బెల్' మోగిన శబ్దమయింది.

వెళ్లి తలుపు తెరిచాడు విశ్వనాధరావు. ఎదురుగా 'చైతన్య' ముఖంలో ఏదో విషయం తాలూకు వెల్లి విరిసిన ఆనందంతో చాలా హుషారుగా వున్నాడు. చేతిలో బ్యాగ్ వేలాడుతోంది.

ఆ బ్యాగువంక, చైతన్య ముఖంవంక మార్చిచూసి,

"ఎక్కడ మంచి తిరిగొస్తున్నావ్‌రా, ఏ సినిమాకి చచ్చావేంటి" కోపంగా అడిగాడు తలుపుకి అడ్డంగా నిలబడి.

"అయ్యో! నాన్నకెలా తెలిసి పోయింది? ఇవ్వాళ్ల 'వినోదం' సినిమా కెళ్లినట్లు. థియేటర్‌లో ఎవరో చూసిన వాళ్లు చెప్పుంటారు". అని మనసులోనే అనుకుని,

"సారీ నాన్నా! ఇవ్వాళ ఫ్రెండ్సంతా 'వినోదం' సినిమా బాగుందంటే కలిసి వెళ్లాం సరదాగా" అని చెప్పి లోపలికి రాబోయే ప్రయత్నం చేశాడు చైతన్య, తండ్రి చేతుల్ని మృదువుగా విదిలించుకుంటూ...


"మరి, పదిహేను రోజుల సంగతి! నువ్వు కాలేజీకి 'ఫిఫ్టీన్ డేస్' నుంచి వెళ్లడం లేదటగా? ప్రిన్సిపాల్ లెటర్ పంపించాడు. ఎక్కడ తిరుగుతున్నావ్? ఏం చేస్తున్నావ్?" ఈసారి మరింత స్వరం పెంచి అడిగాడు విశ్వనాధరావు.


"తను 'శైలజ'ను ప్రేమిస్తున్నానని, ఆ అమ్మాయిని పెళ్లి చేసుకోవడం కోసం తంటాలు పడుతున్నానని ఎలా చెప్పడం డాడీకి? అని మనసులోనే ప్రశ్న వేసుకుంటూ అసలు సమాధానం చెప్పేయడానికి రెడీ అయిపోయాడు చైతన్య. ఎందుకంటే అతనికి 'వినోదం' సినిమా చూశాక ధైర్యం వచ్చింది. శైలజ వాళ్ల ఫాదర్‌ని ఒప్పించడం ఎలాగో 'క్లూ' దొరికిపోయింది కాబట్టి. (ఆ సినిమాలో)

* * *

క్యాలెండర్‌వేపు చూసిన సురేష్ "అరే! ఇవ్వాళ తారీఖు నాలుగు! ఇప్పటికి మూడు రోజులు ఎలాగో గడిపేశాం. ఈరోజు ఊర్కుకోడిక ఓనరు. అద్దె ఎలా కట్టెయ్యడం? అడిగాడు రామారావు, ఆదిరెడ్డి, సురేష్‌లను.

వాళ్లు నలుగురు కలిసి నాలుగు నెలలనుంచి ఆ ఇంట్లో అద్దెకుంటున్నారు. అద్దె ఎక్కువేం కాకపోయినా నలుగురికి ఉద్యోగం, పాడు లేనందున ఆ చిన్నద్దె కాస్త పెద్ద సమస్యగా తయారైంది. ఏ నెలకానెల ఏదో అబ





ద్దమాడుతూ అద్దెలో సగమో, పావో కడుతూ కాలం వెళ్ళుకొచ్చారు.

"అరె! నువ్ పొద్దున్నే వెధవ డౌట్లన్నీ ఎత్తకురా! ఇన్నేళ్లు మనం ఎలా వెళ్ళు కొచ్చాం. అలాగే వెళ్ళుకొస్తాం ఈనెల కూడా" అంటూ తిట్టబోయాడు శ్రీనివాస్.

"అరె! నాకో అయిడియా వచ్చింది. మనం రోజూ ఒక పనిచేద్దాం ప్రొద్దున్నే మన ఇంటి ఓనరు నిద్రలేచే సరికల్లా మనం బయటికి చెక్కేసి, నైటు ఇంటికి రోజూ 'సెకండ్ షో' సినిమా చూసి వచ్చేద్దాం. అప్పటికి గుర్నాథం (ఇంటి ఓనరు) గుర్రుపెట్టి నిద్రపోతాడు. ఎలావుంది నా అయిడియా" అని అడిగాడు ఆదిరెడ్డి.

"ఏంటీ! రోజుకో సినిమావా? రోజూ సినిమాకి పెట్టే డబ్బులే వుంటే ఇంటద్దె కట్టేస్తాం కదరా –నీ ఎంకమ్మా" అంటూ ఆదిరెడ్డి నెత్తిమీద రెండేయబోయాడు రామారావు.

"మీరేం వర్రీ కాకుండి. ఇక గుర్నాధానికి 'మస్కా' ఎలా కొట్టాలో నా దగ్గర సూత్రాలున్నాయి. నిన్న మిమ్మల్నందర్నీ వదిలి బయటికెళ్లామగా. ఎక్కడికి వెళ్ళానమకున్నారు. ఓ పాత ఫ్రెండ్ కలిస్తే 'వినోదం' సినిమాకెళ్ళాను. ఆ సినిమాలో మనలాగే నలుగురు కుర్రాళ్ళకి 'ఇంటద్దె' కట్టడం ఒక సమస్యగా తయారవుతుంది. అది వాళ్లు ఎంతో తెలివిగా ఒక 'ప్లాన్'తో అద్దెబారినుంచి బయట పడతారు." అని రామారావు చెబుతుండగానే.

"ఏమిటా ప్లాన్?" అడిగాడు సురేష్ ఆత్రంగా.

"దగ్గరకు రండి చెబుతా" అనివారి చెవిలో వూదాడు రామారావు.

"యురేకా" అని అరిచారు మిగతా ముగ్గురూ!

* * *

చూశారుగా వాళ్ల సమస్యలు!

చైతన్యకు లవ్ సమస్య!

సురేష్, శ్రీనివాస్....వాళ్లకు ఇంటి అద్దె సమస్య!

ప్రకాశ్, విజయ్.....వాళ్లకు మంచి 'ఎంటర్‌టైన్‌మెంట్' సమస్య!

ఇలా –ఒకటేమిటి? కుర్రకారుకి ఎన్నో సమస్యలుంటాయి. సరదాగా కాలం గడిపేయాలనే ఆలోచనలు వుంటాయి.

అలాంటి 'యూత్' సమస్యలకు ఒక చక్కటి పరిష్కార రూపంలాగా, వాళ్ల వినోదానికి కనువిందుచేసే ఓ చక్కటి దృశ్య కావ్యంగా మలచుకున్న చిత్రరూపమే 'మనీషా ఫిలింస్' వారి 'వినోదం' చిత్రం.

కొబ్బరి బోండాం, రాజేంద్రుడు–గజేంద్రుడు, మాయలోడు, యమలీల, ఘటోత్కచుడు వంటి చక్కటి హిట్ చిత్రాలను అందించిన మనీషా సంస్థ తాజాగా ఈ 'వినోదం' చిత్రాన్ని నిర్మించింది.

హిట్ చిత్రాలు ఇవ్వడంలో నేర్పరి అయిన 'ఎస్.వి.కృష్ణారెడ్డి' తనదైన స్టయిల్‌లో 'కథ, స్క్రీన్‌ప్లే, సంగీతం, దర్శకత్వం' బాధ్యతలను నిర్వహించి కుర్రకారుని తన ఊహల పల్లకిలో ఊరేగించేలా రూపుదిద్దాడు.

ఈ 'వినోద' భరితానికి మూలకర్త అంటే నిర్మాత కె.అచ్చిరెడ్డి.

ఈయన 'మనీషా ఫిలింస్' సంస్థకు అధినేత. నిర్‌మొహమాటంగా 'మంచి ముత్యాలు' (సకుటుంబ భరితంగా చూడదగ్గవి) మాత్రమే తీయాలనుకునే నిర్మాత!

–కీర్తి



Ad